# దివ్యాంగుల హక్కులపై అవగాహన

### గాంధీ ఆస్పత్రిలో వైద్యులకు అవగాహన శిబిరం



గాంధీ ఆస్పత్రిలో దివ్యాంగుల హక్కుల చట్టం గురించి వివరిస్తున్న ప్రొఫెసర్ వాల్యా

బన్సీలాల్‌పేట, డిసెంబర్ 4: వైద్యం కోసం వచ్చే వైకల్యం గల వ్యక్తుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్థోపెడిక్ విభాగం హెచ్ఓడీ ప్రొఫెసర్ బి.వాల్యా అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా సోమవారం గాంధీ ఆస్పత్రిలోని ఆర్థోపెడిక్ విభాగం సెమినార్ హాల్లో పీజీ వైద్యులకు అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శారీరక, మానసిక వైకల్యం గల వ్యక్తులకు కూడా ఐక్యరాజ్య సమితి మార్గదర్శక సూచనల మేరకు 2016లో ప్రత్యేక చట్టం రూపొందించబడినదని అన్నారు. దివ్యాంగుల హక్కుల చట్టం- 2016లో పేర్కొన్న పలు ముఖ్యమైన అంశాలను ఆయన వారికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పుట్టుకతోనే వైకల్యం కలిగిన వారు, ప్రమాదవశాత్తు వైకల్యం బారిన పడిన వ్యక్తుల హక్కులకు భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారి శారీరక వైకల్యాన్ని బట్టి వివక్ష చూపవద్దని, సాధారణ వ్యక్తుల మాదిరిగానే వైద్య సేవలందించాలని వైద్యులకు సూచించారు. ఈ అవగాహన శిబిరంలో ఆర్థోపెడిక్ విభాగం ప్రొఫెసర్లు డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ రవీందర్ కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, రెసిడెంట్ డాక్టర్లు, పీజీలు పాల్గొన్నారు.

## నేడు కందిమళ్ల సాంబశివరావుకు..

### చాట్ల శ్రీరాములు ప్రతిభా పురస్కారం



చాట్ల శ్రీరాములు ప్రతిభా పురస్కార కార్యక్రమ ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న రమణా చారి, కామేశ్వరావు

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 4: రసరంజని, చాట్ల శ్రీరాములు థియేటర్ ట్రస్టు సంయుక్తాధ్వర్యంలో నాంపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని ఆడిటోరియంలో డిసెంబర్ 5 (మంగళవారం)వ తేదీ సాయంత్రం చాట్ల శ్రీరాములు 92వ జయంతిని నిర్వహించనున్నట్లు చాట్ల శ్రీరాములు థియేటర్ ట్రస్టు కన్వీనర్ ముట్నూరి కామేశ్వరరావు తెలిపారు. చాట్ల శ్రీరాములు ప్రతిభా పురస్కారాన్ని 2023కు గాను రంగస్థల నటుడు, రచయిత, పరిశోధకుడు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావుకు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా.. రెడ్‌హిల్స్‌లోని నఫీజ్ రెసిడెన్సీలో విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి. రమణాచారి తన కార్యాలయంలో ఈ కార్యక్రమ ఆహ్వాన పత్రికను కామేశ్వరరావు తదితర సభ్యులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యువభేరి థియేటర్ సంస్థ ఆధ్వర్యంలో అక్కల తామేశ్వరయ్య రచించిన బూడిద హాస్య నాటిక వి.సత్యనారాయణ దర్శకత్వంలో వేదికపై ప్రదర్శిస్తారని తెలిపారు.

## దక్షిణాదిలో మాదిగలను రాజకీయ శక్తిగా మారుస్తాం..

### ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్



విలేకరుల సమావేశం అనంతరం నినదిస్తున్న మాదిగ సంఘాల నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 4: దక్షిణ భారతదేశంలో మాదిగలను రాజకీయ శక్తిగా మారుస్తామని దక్షిణ భారత రాజకీయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ అన్నారు. వర్గీకరణ సమస్య పరిష్కారానికి కట్టుబడి ఉన్నామన్నారు. ఇందుకు ఒక కమిటీ వేస్తున్నామని సాక్షాత్తూ ప్రధాని నరేంద్ర మోదీ చెప్పినా రాష్ట్రంలో ఒక్క రిజర్వ్‌డ్ సీటు బీజేపీ గెలవకపోకుండా ఉండేందుకు కారణం గత 30 ఏండ్లుగా మాదిగలకు మోసం చేస్తున్న మంద కృష్ణ మాదిగేనని ఆరోపించారు. మాదిగ కులాల్లో 90 శాతం క్రైస్తవులేనని, మతం మారిన దళిత క్రైస్తవులకు రిజర్వేషన్లు ఇవ్వబోమని సుప్రీం కోర్టుకు తెలిపిన బీజేపీకి మాదిగలు ఎలా ఓటేస్తారని ప్రశ్నించారు. తార్నాకలోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఇటుక రాజు, ఏపీ ఎమ్మార్పీఎస్ తెలంగాణ ఇన్‌చార్జి మాతంగి ఓదెలు, మాదిగ మేధావుల ఫోరం ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ నతానియల్, డాక్టర్ నరసింహ నాయుడుతో కలిసి వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో దక్షిణాదిలోనే 130 ఎంపీ స్థానాల్లో మాదిగలను నిలబెడుతామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని 175 ఎమ్మెల్యే స్థానాల్లోనూ అభ్యర్థులను నిలుపుతామని చెప్పారు. దీనిపై చర్చించేందుకు ఈ నెల 6న విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో అన్ని మాదిగ గ్రూపులతో కలిసి చర్చించనున్నట్లు వివరించారు.



### ఆచార్య జి.రామిరెడ్డికి ఘననివాళి

డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వ్యవస్థాపకులు ఆచార్య జి.రామిరెడ్డి జయంతి సందర్భంగా సోమవారం యూనివర్సిటీ ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొ. కె.సీతారామారావు, విద్యార్థి సేవల విభాగం డీన్ డా. బానోత్ లాల్, ప్రొ. షకీలాఖానమ్‌తో పాటు పలు విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

– బంజారాహిల్స్, డిసెంబర్ 4

# జూబ్లీహిల్స్‌లో సంబురాలు

- హ్యాట్రిక్ కొట్టిన ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్
- కార్పొరేటర్ల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా సింహ భాగం స్థానాలు కైవసం



యూసుఫ్‌గూడలో ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

జూబ్లీహిల్స్, డిసెంబర్ 4: జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఘన విజయం సాధించడంతో పార్టీ శ్రేణులు సంబురాలలో మునిగిపోయారు. ఈ విజయంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మరోసారి బీఆర్ఎస్ జెండా ఎగురవేసిన ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు ఆ పార్టీ శ్రేణులు అపూర్వ స్వాగతం పలికారు. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ హ్యాట్రిక్ విజయం సాధించడమే కాకుండా.. జూబ్లీహిల్స్‌ను బీఆర్ఎస్‌కు కంచుకోటగా నిలిపారు. ఆదివారం రాత్రి ఓట్ల లెక్కింపు ముగిసిన తర్వాత రిటర్నింగ్ అధికారి రవి చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రం అందుకున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు పార్టీ శ్రేణులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్ కార్పొరేటర్లు రాజ్‌కుమార్ పటేల్, దేదీప్యరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పాల్గొన్నారు. జూబ్లీహిల్స్‌లో పార్టీ ఘన విజయం సాధించడంతో పార్టీ శ్రేణులు భారీ ర్యాలీతో విజయోత్సవాలు నిర్వహించారు. అంతేకాకుండా.. హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ఆయన నేతృత్వంలో నగరంలో సింహభాగం స్థానాలు బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుంది. దీంతో పార్టీ శ్రేణులు విజయోత్సవ సంబురాలను మరింత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## జనవరి 4 నుంచి గుజరాతీ ఏక్తా మహోత్సవం

ఖైరతాబాద్, డిసెంబర్ 4 : గుజరాతీల సంస్కృతీ, సంప్రదాయాలు ప్రతిబింబించేలా వచ్చే నెల 4 నుంచి ఏప్రిల్ 21వ తేదీ వరకు నగరంలో గుజరాతీ ఏక్తా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గుజరాతీ సమాజ్ అధ్యక్షుడు ప్రేమల్ పరేఖ్ తెలిపారు. సోమాజిగూడలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు చందులాల్ పటేల్, మన్సుఖ్ పటేల్, ప్రధాన కార్యదర్శి మినల్ వఖారియాతో కలిసి వివరాలను వెల్లడించారు. 4న నగరంలో గుజరాతీల భారీ రోడ్ షో నిర్వహిస్తామన్నారు. మహిళల కోసం బాక్స్ క్రికెట్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, కిడ్స్ ఫ్యాషన్, మిస్ అండ్ మిసెస్ తెలంగాణ గుజరాతీ పోటీలు.. తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

# ఒంటె మాంసం విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

### నాలుగు ఒంటెలు స్వాధీనం



సిటీబ్యూరో, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): ఒంటె మాంసాన్ని విక్రయిస్తున్న ముగ్గురిని నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారివద్ద నుంచి నాలుగు ఒంటెలను కూడా స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ నితిక పంత్ కథనం ప్రకారం.. బీదర్‌కు చెందిన మహ్మద్ ఇస్మాయిల్ కొంతకాలం కబేళాలో పనిచేశాడు. ఆ తరువాత హైదరాబాద్‌కు వచ్చి టోలిచౌకి, పారామౌంట్ కాలనీలోని గేట్ నం.2 వద్ద బెస్ట్ బీఫ్ షాప్ పేరుతో బీఫ్ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. టోలిచౌకి ప్రాంతానికి చెందిన మహ్మద్ సల్మాన్, సిరాజ్ ఖాన్‌తో కలిసి ఒంటెలు తెచ్చి, వాటి మాంసాన్ని విక్రయించేందుకు పథకం చేశారు. ఇందులో భాగంగా మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో శ్యామ్ అనే వ్యక్తిని సంప్రదించారు. అతడి వద్ద 7 ఒంటెలు కొనుగోలు చేసి, హైదరాబాద్‌కు తరలించారు. ఒక్కో ఒంటెను కోస్తూ.. కిలో మాంసం రూ.400 చొప్పున విక్రయిస్తున్నారు. మూడు ఒంటెలను వధించారు. మిగతా నాలుగు ఒంటెలను కూడా వధించేందుకు ప్లాన్ చేస్తున్నారు. అక్రమంగా ఒంటె మాంసాన్ని విక్రయిస్తున్నరనే సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి బృందం దాడిచేసింది. నిందితుల వద్ద నుంచి నాలుగు ఒంటెలు, మాంసం బరువు చూసేందుకు ఉపయోగిస్తున్న మిషన్లు, ఒంటెలను కోసేందుకు ఉపయోగించిన కత్తులు.. తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం ఫిలింనగర్ పోలీసులకు అప్పగించారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## గోవాలో రోడ్డు ప్రమాదం..

### ముగ్గురు నగర వాసుల మృతి

సిటీబ్యూరో, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): గోవాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నగరానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. రష్యాన్ టూరిస్ట్ నిర్లక్ష్యంగా వాహనం నడుపుతూ రోడ్డు దాటుతున్న ఈ ముగ్గురిని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదానికి కారకుడైన రష్యన్ దేశస్తుడు అంటోని బైక్చోకోవ్ కూడా గాయాలపాలయ్యాడు. అతడు గోవా మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. హైదరాబాద్ ఓల్డ్ సిటీకి చెందిన మహేశ్ శర్మ, దిలీప్‌కుమార్, మనోజ్‌కుమార్ ముగ్గురు స్నేహితులు. శుక్రవారం గోవాకు వెళ్లి.. కలాంగట్ ప్రాంతంలోని హోటల్‌లో బస చేశారు. శనివారం తెల్లవారుజామున నార్త్‌గోవాలోని ఆర్పోర ప్రాంతంలో రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మరణించిన ముగ్గురి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన పోలీసులు.. వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిందితుడిపై అంజునా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## రోడ్డు ప్రమాదంలో..

మహేశ్వరం, డిసెంబర్ 4: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మహేశ్వరం పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. ఎస్సై రవీందర్ కథనం ప్రకారం.. రాచులూరు గేట్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి వయస్సు సుమారు 45 నుంచి 50 ఏండ్లు ఉంటుంది. మృతుడికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా వైద్యశాల మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే మహేశ్వరం పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

## గన్‌మెన్‌లను నిరాకరించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా, డిసెంబర్ 4: ఉప్పల్ నూతన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గన్‌మెన్‌లను నిరాకరించారు. లక్ష్మారెడ్డి భద్రత కోసం పోలీసు శాఖ ఇద్దరు గన్‌మెన్‌లను కేటాయించింది. వారిద్దరూ ఎమ్మెల్యేకు రిపోర్టు చేయగా.. సోమవారం ఆయన వారిని వెనక్కి పంపుతూ.. సంబంధిత డీసీపీకి లేఖ రాశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎల్ఆర్ మాట్లాడుతూ.. తన నియోజకవర్గం ప్రజలే తనకు శ్రీరామ రక్ష అని అన్నారు. తనకు ప్రత్యేక రక్షణ అవసరం లేదన్నారు. పది కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఉప్పల్‌లో తిరిగేందుకు ప్రత్యేకంగా తనకు రక్షణ అక్కరలేదని తాను భావిస్తున్నట్టు తెలిపారు.